"The way of life should be pregnant with high morals" (Easiest Way, Showers of Divine Grace, page 65, 2006 Edition)

జీవన యాత్రను సద్గుణములతో సాగించాలని ఉద్బోధించారు ( అమృత వర్షిణి - 73)

రవి ఏలూరిపాటి

పూజ్య శ్రీ కే సి నారాయణ గారికి మరియు అందరికి నా అభివాదములు. నేటి సెమినార్ విషయము 'పరతత్వం పొందడానికి సులభమార్గము' అను సందేశము నుండి తీయబడింది ఈ సందేశములో పూజ్య బాబూజీ గారిని సందర్శించ వచ్చిన వారిని వుద్దేశిస్తూ సత్ తత్వప్రాప్తి స్థితి విషయాలూ -దానికి సరిపడ దృడమైన సంకల్ప అవసరాలూ, నైతిక మరియు యుక్తమైన నడవడిక యొక్క అవసరము, వారంతా వ్రాసిన లేఖలు – కష్టాలు వొత్తిడుల గురించి వివరణ, దైవత్వము - శూన్యత్వము గురించి, ధ్యాన – క్షాళన – ప్రార్ధన యొక్క ఉపయోగాలూ – చేసే విధానం, నిజమైన ప్రేమ వంటి ఎన్నో విషయాలు సర్వ సాధారణమైన శైలిలో విశదీకరించి 'జీవితంలో జీవనం' అనే భావన గురించి వివరించారు. ఎప్పటిలాగే పూజ్య బాబూజీ గారి సందేశం చదివి, ఎంత సరళంగా వ్రాస్తారో అనుకుంటూ పరవశించాను. చదివిన ప్రతిసారి ఒక కొత్త అనుభూతినీ అనిర్వచనీయమైన ఆనందాన్నీ యిస్తాయి ఈ సందేశాలు.

నేడు మనము ఆధ్యాత్మిక జీవన శైలిలో నైతిక విలువలు యిమిడి వుండటం గురించి ప్రస్తావించుకుంటున్నాము నైతిక విలువల గురించి శ్రీరామచంద్రా పబ్లిషర్స్ ప్రచురణలలో పలు చోట్ల విస్తారముగా వ్రాయబడింది. ఇంతకు మునుపు జరిగిన సెమినార్ లో – "The background of spirituality is the 'Moral Courage' which rises when one is moral" [Oct 2008] పూజ్య శ్రీ కే సీ నారాయణ గారు వ్రాస్తూ నడవడిక మీద, నీతి శాస్త్రం మీద, 'నేను ఏమి చేయాలి అనే విషయం కన్నా నేను ఎలా జీవించాలి అనేది అవసరం', వివిధ రకాలైన హద్దులు గీసుకుని మన మనస్సును బంధించు మన మానసిక స్థితి,

సౌశీల్యత, హేళన – అణిచివేత – గౌరవము, సత్ సంగము యొక్క ప్రాధాన్యము, మరెన్నో నైతిక విలువలతో కూడిన ఆధ్యాత్మిక జీవన విధాన విశేషాలు వ్రాసారు. వీటిని చదివి అర్థం చేసుకుని, పాటించి, వాటి విలువ తెలుసుకోవడము ఎంతో అవసరం. ఇటువంటి సెమినార్ల వల్ల మళ్ళీ మళ్ళీ ఇవి చదవడానికీ సత్యపథమార్గాన్ని వివిధ కోణాలనుంచి అర్థంచేసుకోవడానికీ ఎంతో సహాయపడుతున్నాయి.

గత 2-3 శతాబ్దాలుగా భూమిపై జరిగిన అక్రమ అవినీతి సంఘటనలు ఎంతో మనోద్వేగాన్ని కలిగించాయి. వరల్డ్ వార్, జపాను దేశంపై అణు బాంబుల వల్ల జరిగిన విధ్వంసం, ర్వాండా దేశంలో ఇటీవల జరిగిన ఉమ్మడి వధ (Genocide, 1994), దైనందిన వ్యవహారాలలో జరిగే అక్రమ కృత్యాలూ, మరెన్నో దుర్ఘటనలు మానవుడి దురహంకారముతో కూడిన పైశాచిక ప్రవృత్తికి నిదర్శనాలు. వీటన్నిటికీ కారణం ఒక్కటే – మానవుడు కనీసం నైతికంగా బ్రతకలేక పోవడమే! పలువురు తత్వవేత్తలు పలువిధాలుగా విషయాన్ని సమాజానికి తెలియజేయ ప్రయత్నించారు. మానవ అవినీతితో కూడిన మారణ హెూమానికి కారణం మన శిక్షణా పద్ధతి సరియైనది కాదని, జల్సా జీవితమని, సోమరితనమని, పనిలేకుండా వుండడమని, మనస్సుపై పరులుచేసే కనుకట్టు ప్రభావమని (Environmental Hypnosis), కుటుంబ విలువలు దిగజారుట వలనయని, తన గురించి తాను బ్రతకడమేయని, నయవంచన యని, కపటమని, వివిధ విధాలుగా చెప్పి ఒక్కొక్క వికల్పానికి ఒక్కో సంకల్పాన్ని పరిష్కారంగా తెలిపారు. దీని వల్ల కొద్దిపాటి పరిష్కారము లభించిందే కాని వీటికి నిశ్చయపూర్వకంగా పూర్తి పరిష్కారము లభించలేదు. కారణం? మన ప్రయత్నంలో లోపం, మనకంతా తెలుసు అనే అహంకారము మరియు మూలకారణానికి వెళ్ళక పోవడమే!

మరి మూల కారణం యేమిటి? ఈ ప్రశ్నకు సమాధానం కావాలంటే అసలు నైతికంగా బ్రతకటం అంటే యేమిటో తెలుసుకోవాలి. పూజ్యబాబూజీ మహరాజ్ గారు ఈ విషయమై ఈ విధంగా తెలిపారు, “నీతివంతమనగా యేమిటి? మనలోని అన్ని శక్తులు సమత్వ స్థితికి చేరి సరిగ్గా

ఉపయోగ పడుటయే. ఇది ఏ విధముగా సాధ్యమగును? మనిషి తన అహంకారమును వీడినపుడు యిది వృద్ధిచెందుట మొదలిడును. అందువలన యేమతములో యిచ్చిన పద్ధతులైనా దీని కొరకే. దీనికి సహజమార్గములో పద్ధతులు చాలా సులభమైనవి. 'అహం' నకు ఎక్కువ ప్రాముఖ్యత నిచ్చినచో నీతి నశించును. ఆత్మను దైవత్వము వైపు మళ్ళించు పాత్రను ప్రశిక్షకులు మాత్రమే పోషించవలెను" (అ.వ -60) మరియు "సహజ మార్గ విధానములో, పనిచేయుట ప్రశిక్షకుల వంతు, మార్పు చెందుట అభ్యాసీ వంతు."(అ.వ -59) యని కూడా చెప్పారు. పూజ్య డా. కె. సి. వరదాచారి గారు శ్రీరామచంద్రరాజయోగ ప్రసంగాలలో ప్రార్థన గురించి వివరిస్తూ కోరికలు అహంభావాన్నీ బాంధవ్యాలని ప్రేరేపిస్తాయి యని మరెన్నో విషయాలని హృదయంగమంగా తెలిపారు. దైవ సహాయం లేనిదే అహం నుండి విముక్తి పొందినవారెవ్వరూ లేరని కూడా వారు అభిప్రాయ పడ్డారు. ( http://www.drkcv.org/Books/kcv1chap_33.htm, Dr KCV Vol I Lecture 15)

వీటి వల్ల మనము తెలుకోవలసిన విషయాలలో ముఖ్యమైనవి అహాన్ని అదుపులోనికి తీసుకురావడం, ఆధ్యాత్మిక జీవనం వైపు మరలడం మరియు సహాయం తీసుకోవడం. ఇవేగాక మనము దైవానికి లొంగ వలెను అనే విషయాన్ని ముఖ్యంగా గ్రహించాలి. 'ఒకే ఒరలో రెండు కత్తులుండవు' – మన హృదయంలో కూడా దైవమే వుండాలి కానీ మన అహం వుండకూడదు. సత్యపథమార్గంలో సాధకుడు చేసే ప్రార్థన, A మరియు B బిందువులపై ధ్యానములేగాక సకల ధ్యాన పద్ధతులతో పాటు ముఖ్యంగా ప్రాణాహుతి యనెడి సూక్ష్మ యోగ ప్రక్రియ యొక్క సహాయం వల్ల అహాన్ని వదలి ఆధ్యాత్మికంగా ఎదగడానికి దోహద పడతాయి. పూజ్య బాబూజీ గారిచ్చిన దశాదేశాలలో యెన్నో ఆధ్యాత్మిక విషయాలున్నాయి. కేవలం నైతిక విషయాల గురించి వాటినసురిస్తే సముద్రమునుండి ఉగ్గుగిన్నెతో నీళ్ళు తెచ్చుకున్నట్టే!

ఆధ్యాత్మికంగా మానవుడు ఎప్పుడైతే ఎదగటాని సిద్ధపడడో అనేక విధాలుగా అసంతృప్తికి గురి అవుతాడని తలచవచ్చు. అహంకారము దారి మళ్ళితే జరిగే అనర్థాలు అనేకం. అయితే అపుడెపుడో తప్పు చేసామనీ అసత్యమాడామనీ తమకుతామే గిరి గీసుకుని ఘనీభూతులై (frozen state of mind) వుండిపోవటం సమంజసం కాదు.

బొమిక లేని నాలుక బొంకునులే యంతైన
సత్యం బల్కు విలువ గ్రహింపవలె కొంతైన
వట వృక్షమునకు విత్తనంబు కొంచెమై వుండదా
సాధించవలె సకలము గురు కృప తోడై వుండగా

పూజ్య బాబూజీగారు ఎంతో సహృదయంతో సద్భావనతో ‘అహాన్ని వీడి దైవంపైపు మరలితే’ సరిపోతుందన్నారు (అ.వ – 60). వివిధ కోశాలలో, గ్రంథులయందు వచ్చే అడ్డంకులు దైవము పైపు మరలకపోవడమూ, పూర్తిగా లొంగక పోవడమే నని గ్రహించాలి. ధ్యాన పద్ధతుల ననుసరిస్తూ ప్రాణాహుతి తోడ్పాటు తీసుకుంటూ, గేమ్ ఆఫ్ లైఫ్, పిండ్ దేష్ ప్రశ్న పత్రం వంటి వివిధ పరికరాలు ఉపయోగించిన అవి సాధనకు దోహద పడుతాయి. పిండ్ దేష్ ప్రశ్న పత్రం ప్రచురణలో వివిధ కోశాలలో బంధన-నిర్బంధనల విషయాలు ఎన్నో తెలిపారు. బంధీ అయి శూన్యం పైపు కాకుండా బంధనాలను ఛేదించి శూన్యత్వం దిశగా మనము వెళ్ళాలి. ‘గేమ్ ఆఫ్ లైఫ్’ ఆటలో (http://www.sriramchandra.org/ Books/PG/PGChap_23.htm) మన చైతన్యపు వివిధ ప్రకృతి - వికృతి రూపాల గురించి ఎంతో వివరంగా తెలుపుతూ జీవితంలో తోటి వారివల్ల మనకు లభించే సహాయాలూ, చిత్తశుద్ధి లేనందు వల్ల కలిగే నష్టాలూ, ఆధ్యాత్మిక పురోభివృద్ధి వల్ల కలుగు సూక్ష్మ చైతన్య స్థితుల వర్ణన, ఇంకా ఎన్నో విషయాలు తెలిపారు. ఈ పరిశీలనా సాధనాలు మనకు ఆధ్యాత్మిక పురోభివృద్ధి విషయాలే

కాకుండా బాహ్య ప్రవర్తనా, వైఖరుల విషయాలు తెలుపడం వల్ల చాలా ఉపయోగకరంగా వుంటాయి.

జీవితపు ఆట ఎలాగూ ఆడాలి – ఆ ఆట దివ్యమై, దైవ సన్నిధిలో చేయటం సర్వమానవాళికి శుభప్రధం.

స్వస్తి.